www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 29 సెప్టెంబరు 2024

5

పశ్చిమ గోదావరి



30న కెవిపిఎస్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్

భీమవరం: మత విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తూ తనకు తానే సమర్థించుకుంటున్న ఉండి ఎంఎల్ఎ వైఖరిని ఖండిస్తూ ఈ నెల 30న కెవిపిఎస్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బత్తుల విజయ్‌కుమార్, కె.క్రాంతిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఏలూరుపాడులో జరిగిన ఫ్లెక్సీ వివాదానికి మత విశ్వాసాలను జోడించడాన్ని ఖండిస్తున్నామని పేర్కొన్నారు. మతాన్ని రాజకీయం చేయొద్దని సూచించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఫొటోతో ఉన్న బ్యానర్‌ను స్వయంగా ఎంఎల్ఎ తొలగించడం అన్యాయమని పేర్కొన్నారు. తక్షణం ఉండి ఎంఎల్ఎ తన వ్యాఖ్యలను విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. నెల 30న సోమవారం ఉదయం 10గంటలకు భీమవరం లాంచీలరేవు వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.మాల్యాద్రి, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, దళిత, ప్రజాసంఘాల నేతలు, అభ్యుదయవాదులు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంఘ నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.

సీలింగ్ భూములకు

పంట రుణాలు నిలిపివేత

- సహకార సంఘాల్లో రైతులకు ఎదురుదెబ్బ
- 30 ఏళ్లుగా ఇస్తున్న పంట రుణాల నిలిపివేతపై రైతుల ఆగ్రహం
- రెండు జిల్లాల్లో వేలాది మంది రైతుల పరిస్థితి అగమ్యగోచరం
- సీలింగ్ భూములున్న రైతులంతా పేద దళితులు, బిసిలే
- సొంతభూమి, పట్టా ఉన్నా పంట రుణం ఇవ్వకపోవడంపై విస్మయం
- ఎంఎల్ఎలు, జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోవాలని రైతుల వేడుకోలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సీలింగ్ భూముల రైతులకు సహకార సంఘాల్లో పంటరుణాల మంజూరును నిలిపివేయడం రెండు జిల్లాల్లో సర్వత్రా చర్చనీయాంశమైంది. కౌలురైతులకు బ్యాంకుల నుంచి పంటరుణాలు మంజూరు చేయాలని ఆందోళనలు జరుగుతున్న క్రమంలో పట్టాలున్న సీలింగ్ భూములకు పంటరుణాలు నిలిపివేత అత్యంత దారుణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంటరుణాలు ఇవ్వకపోగా.. గతంలో ఇచ్చిన రుణాలు వెంటనే చెల్లించాలంటూ రైతులపై తీవ్రమైన ఒత్తిడి తెస్తుండటంపై రైతులు తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారు. సీలింగ్ భూములున్న రైతులంతా ఎస్‌సి, బిసి సామాజిక తరగతులకు చెందినవారే. డిసిసిబి పరిధిలో ఏలూరు జిల్లాలో 159, పశ్చిమగోదావరి జిల్లాలో 122 మొత్తం 281 సహకార సంఘాలు ఉన్నాయి. సహకార సంఘాల ద్వారా జిల్లా రైతాంగానికి ప్రతియేటా పెద్దఎత్తున పంట రుణాలు మంజూరు చేస్తున్నారు. ప్రభుత్వం పేదలకు సీలింగ్ భూములిచ్చి దాదాపు 35 ఏళ్లకుపైగా గడిచిపోయింది. అప్పటి నుంచి సీలింగ్ భూములకు సహకార సంఘాల్లో పంట రుణాలు మంజూరు చేస్తున్నారు. ఇప్పుడు హఠాత్తుగా సీలింగ్ భూములకు పంటరుణాలు నిలిపివేస్తూ సాగుచేసే రైతులను ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకూ సమంజసమో ప్రభుత్వమే చెప్పాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో మార్చిలోనే ఈ పరిస్థితి ఏర్పడిందని, కొత్త ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం అప్పట్లో పేద కుటుంబాలకు చెందిన దళిత, బిసి సామాజిక తరగతులకు అరెకరం చొప్పున సీలింగ్ భూములను పంపిణీ చేసింది. ఆ భూములకు క్రాప్‌లోన్ కింద రూ.25 వేల వరకూ సహకార సంఘాలు ఇస్తున్నాయి. పంటరుణం అనేది సాగుచేసే పంట ఆధారంగా ఇస్తారు. ప్రతియేటా మార్చిలో తీసుకున్న రుణం చెల్లించడం, కొత్తరుణం తీసుకోవడం పరిపాటిగా సాగుతోంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సీలింగ్ భూములకు సంబంధించిన మార్టిగేజ్ (తనఖా ప్రక్రియ) జరగకపోవడం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని సహకార సంఘాల అధికారులు చెబుతున్నారు. ఈ సమస్యను ప్రభుత్వం పరిష్కరిస్తే తప్ప రైతులకు న్యాయం జరిగే పరిస్థితి కన్పించడం లేదు.

పంట రుణం ఇవ్వకపోతే సాగు చేసేదెలా..

సొంత భూమి ఉండి, ఆ భూమికి పట్టా ఉన్నా రకరకాల కారణాలతో సీలింగ్ భూములకు పంటరుణాలు నిలిపివేస్తే రైతులు పెట్టుబడి కోసం ఏం చేయాలనే ప్రశ్నకు ఏ ఒక్కరి వద్ద సమాధానం లేకుండాపోయింది. సహకార సంఘాల్లో పంట రుణాలను నిలిపివేయడంతో సీలింగ్ భూముల రైతులు రుణాల కోసం నానా ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టాల్సిన దుస్థితి దాపురించింది. దీంతో సహకార సంఘాల జనరల్‌బాడీలో రైతులు అధికారులను నిలదీస్తున్న పరిస్థితి సైతం నెలకొంది. సీలింగ్ భూముల రైతులకు సహకార సంఘాల్లో వెంటనే పంట రుణాలు మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

రిజిస్ట్రార్ కార్యాలయంలో డిక్లరేషన్ కాకపోవడంతోనే సమస్య

నారా తిలక్, సిఇఒ, డిసిసిబి

సహకార సంఘాల్లో సీలింగ్ భూముల రుణాల మంజూరు సమస్య నా దృష్టికి వచ్చింది. రిజిస్ట్రార్ కార్యాలయంలో సీలింగ్ భూములకు సంబంధించిన మార్టిగేజ్ కావడం లేదు. ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం రిజిస్ట్రార్ కార్యాలయంలో డిక్లరేషన్ కాకుండా పంట రుణం ఇవ్వడం సాధ్యం కాదు. జిల్లాలో పెద్దసంఖ్యలోనే సీలింగ్ భూముల రైతులు ఉన్నారు. గతంలో ఇచ్చిన మార్టిగేజ్ 12 ఏళ్లు దాటకపోతే రుణాలిస్తున్నాం. దాటితే మాత్రం మళ్లీ చేయించాల్సి ఉండటంతో అది పూర్తికాక సమస్య ఏర్పడింది. ఆప్కాబ్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లాం.

30 ఏళ్ల నుంచి ఇస్తూ హఠాత్తుగా పంట రుణం ఆపేశారు

పెట్టా వెంకటేష్, దళిత రైతు, అడవికొలను, నిడమర్రు మండలం

ప్రభుత్వం మా కుటుంబానికి అరెకర భూమి సీలింగ్ కింద ఇచ్చింది. అడవికొలను సహకార సంఘంలో గడిచిన 30 ఏళ్లుగా పంటరుణం తీసుకుంటున్నాం. ఈ ఏడాది మార్చిలో పంటరుణం ఆపేశారు. జనరల్‌బాడీలో దీన్ని లేవనెత్తాం. పైస్థాయికి పంపుతామని చెప్పారు. హఠాత్తుగా పంటరుణం నిలిపివేస్తే సాగు ఎలా చేయాలి. ప్రభుత్వం వెంటనే తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం.

బకాయిలు చెల్లించినా రుణాలు ఇవ్వకపోవడం ఏమిటి

పీతల దానియేలు, రైతు, అడవికొలను

ప్రతియేటా పంట రుణం తీసుకోవడం సకాలంలో చెల్లించడం చేస్తున్నాం. మాకిచ్చిన అరెకర సీలింగ్ భూమికి అడవికొలను సహకార సంఘంలో 30 ఏళ్లుగా పంటరుణం తీసుకుంటున్నాం. ఇప్పుడు ఉన్నట్లుగా పంటరుణాలు నిలిపివేస్తే వ్యవసాయం ఏవిధంగా చేయాలి. ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించాలి.

విద్యార్థులను సుసంపన్నులుగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ నాగరాణి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పిఎంశ్రీ యోజన పథకం నిధులతో పాఠశాలల్లో మౌలిక వసతులను బలోపేతం చేయడంతోపాటు మెరుగైన బోధన, అభ్యాసంతో విద్యార్థులను కీలక నైపుణ్యాలతో కూడిన సుసంపన్న వ్యక్తులుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా-పిఎంశ్రీ యోజన పథకం లక్ష్యాలు, ప్రయోజనాలపై సంబంధిత శాఖల అధికారులతో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పిఎంశ్రీ యోజన పథకం కింద మొదటి విడతలో 24, రెండో విడతలో ఒకటి మొత్తం 25 పాఠశాలలను పిఎంశ్రీ యోజన పథకం కింద ఎంపిక చేశామన్నారు. ఆయా పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ఒక్కో పాఠశాలకు రూ.6 లక్షల నిధులను మంజూరు చేశారని, పాఠశాలలను అభివృద్ధి చేసి అప్‌గ్రేడ్ చేస్తామని తెలిపారు. మెరుగైన బోధన, అభ్యాసం, అన్ని విధాలా అభివృద్ధి మాత్రమే కాకుండా 21వ శతాబ్దపు కీలక నైపుణ్యాలతో కూడిన సంపూర్ణ, సుసంపన్నమైన వ్యక్తులను తయారు చేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఎస్ఎస్ఎ ఎపిసి పి.శ్యామ్‌సుందర్, డిఇఒ కార్యాలయ ఎడి వెంకటేశ్వరరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, బిసి వెల్ఫేర్ అధికారి గణపతిరావు, ఎఎంఒ రామకోటేశ్వరరావు, ఎంపిక చేసిన 25 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎచే మెప్మా అర్బన్ స్టోర్స్ ప్రారంభం



స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో శనివారం స్థానిక బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ స్టోర్స్‌ను ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, బిజెపి కన్వీనర్ మేకల సతీష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నాయకర్ మాట్లాడుతూ ప్రతి మహిళా స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా సంఘాల ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అర్బన్‌స్టోర్స్‌లో ఏర్పాటు చేసిన పలు దుకాణాలను పరిశీలించి సామగ్రిని కొనుగోలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, నాయకులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, జక్కం శ్రీమన్నారాయణ, వలవల నాని, కొల్లు పెద్దిరాజు, పోలిశెట్టి సాంబ, గ్రంధి నాని, యాతం మహేష్, కౌన్సిలర్ తోట అరుణ, బొమ్మిడి సూర్యకుమారి, అంబటి అరుణ, సంకు భాస్కర్‌నాయుడు, బోరా చిన్నాయమ్మ, శశిదేవి పాల్గొన్నారు.


మున్సిపాల్టీని భ్రష్టు పట్టించిన కారుమూరి

ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ విమర్శ

ప్రజాశక్తి - తణుకు

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తణుకు మున్సిపాల్టీని పూర్తిగా భ్రష్టుపట్టించి, తన జేబుసంస్థగా వాడుకున్నారని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ విమర్శించారు. శనివారం స్థానిక కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఎల్ఎగా, మంత్రిగా ఉండి కనీస బాధ్యత లేకుండా శానిటేషన్‌పై కనీస దృష్టి సారించలేదని విమర్శించారు. చిన్నపాటి వర్షం వచ్చినా డ్రెయినేజీలన్నీ మునిగిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. శానిటేషన్ సిబ్బంది అందర్నీ ఇబ్బంది పెట్టి పరిపాలన సాగించాడన్నారు. శానిటేషన్ సిబ్బందిని, కిందిస్థాయి వర్కర్లను 11 మంది మున్సిపల్ సిబ్బందిని కారుమూరి తన ఇంట్లో పని చేయడానికి అక్రమంగా వాడుకున్నారని ఆరోపించారు. గత ఐదేళ్లలో తణుకు మున్సిపాల్టీ నుండి రూ.1.18 కోట్లు మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఇంట్లో పనిచేసే సిబ్బందికి చెల్లించారన్నారు. ఇది ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

మంచి ఆరోగ్యంతోనే ఉన్నత చదువులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న డాక్టర్ జగదీశ్వరి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మంచి ఆరోగ్యంతోనే విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించి మంచి ఉద్యోగాలు సంపాదించుకోగలరని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఆర్.జగదీశ్వరి అన్నారు. కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు ప్రత్యేకంగా ఆరోగ్య సమస్యలపై హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఫర్ యంగ్ ఉమెన్ అనే అంశంపై ప్రత్యేక వర్క్‌షాప్ శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.భువనేశ్వరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగదీశ్వరి మాట్లాడుతూ మహిళలు దైనందిన జీవితంలో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే తమ జీవన ప్రయాణంలో ఎటువంటి అలవాట్లతో ముందుకెళ్లాలనేది వివరించారు. అదేవిధంగా కొన్ని వ్యాధులు, వాటి లక్షణాలను వివరించారు. వీటిని గమనించి వెంటనే చికిత్స పొందితే ప్రాథమిక దశలోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని అందుకోగలరన్నారు. ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ వద్దని స్పష్టం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ప్రత్యేకంగా విద్యార్థినులు తల్లిదండ్రులకు దూరంగా హాస్టళ్లలో ఉన్నప్పుడు తమ ఆరోగ్య విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అందుకే మహిళా వైద్యులతో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. దీనిని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు డాక్టర్ జగదీశ్వరి చేతుల మీదుగా బహుమతులు అందించారు.

జెడ్‌పి ఛైర్‌పర్సన్‌ను అనర్హురాలిగా ప్రకటించండి

సిఇఒకు 30 మంది వైసిపి జెడ్‌పిటిసిల వినతి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీని ఆ పదవికి అనర్హురాలిగా ప్రకటించాలని వైసిపికి చెందిన 30 మంది జెడ్‌పిటిసిలు శనివారం జిల్లా పరిషత్ సిఇఒ కెఎస్‌-ఎస్.సుబ్బారావుకు వినతిపత్రం ఇవ్వడం జిల్లా రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వైసిపి జెడ్‌పిటిసిలు మొత్తం 45 మంది కలిసి 2023 జూన్ ఎనిమిదో తేదీన తమ పార్టీ విప్‌ను అనుసరించి తమలో ఒకరైన గంటా పద్మశ్రీని జెడ్‌పి ఛైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నామని ఆ వినతిలో పేర్కొన్నారు. ప్రస్తుతం పద్మశ్రీ వైసిపి విప్‌ను ధిక్కరించి పార్టీకి రాజీనామా చేసి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారని, ఆమె ఆ పదవిలో ఉండటానికి అనర్హురాలని పేర్కొన్నారు. ప్రస్తుతం గంటా పద్మశ్రీ వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో చేరి పార్టీ విప్‌ను ధిక్కరించినందున ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్‌చట్టం 1994 సెక్షన్ 181(1) ప్రొవిజన్ అనుసరించి ఆమెను ఛైర్‌పర్సన్ పదవి నుండి అనర్హురాలిగా ప్రకటించాలని కోరారు. జిల్లా పరిషత్ అత్యవసర సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపత్రంపై 30 మంది జెడ్‌పిటిసిలు సంతకాలు చేశారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం 1994 సెక్షన్ 181(7) ప్రకారం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఎన్నిక జరపాలని కోరారు.

అనర్హులిగా ప్రకటించే అవకాశం ఉందా..!

2021లో జరిగిన జిల్లా పరిషత్ ఎన్నికల్లో మొత్తం 48 స్థానాలకుగాను 46 చోట్ల వైసిపి గెలుపొందింది. దీంతో జెడ్‌పి ఛైర్‌పర్సన్ పీఠం వైసిపి కైవసం చేసుకుంది. బిసి సామాజిక తరగతికి చెందిన కౌరు శ్రీనివాసులు జెడ్‌పి ఛైర్మన్‌గా 2021 సెప్టెంబర్ 16న ప్రమాణస్వీకారం చేశారు. తర్వాత చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో శ్రీనివాస్ స్థానిక సంస్థల ఎంఎల్‌సి అభ్యర్థిగా బరిలోకి దిగి గెలుపొందారు. దీంతో జెడ్‌పి ఛైర్మన్ పీఠం ఖాళీ అయ్యింది. ఈ క్రమంలో పెదపాడు జెడ్‌పిటిసి గంటా పద్మశ్రీని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా వైసిపి ఎంపిక చేయడంతో 2023 జూన్ 8న ఆమె బాధ్యతలు స్వీకరించారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధించింది. దీంతో జిల్లాలో రాజకీయ పరిణామాలు వేగంగా మారిపోయాయి. కొద్దిరోజుల ముందు గంటా పద్మశ్రీ, ఆమె భర్త ప్రసాద్ టిడిపిలో చేరారు. ఈ క్రమంలో వైసిపికి చెందిన జెడ్‌పిటిసిలు 30 మంది ఆమెను జెడ్‌పి ఛైర్‌పర్సన్ పదవికి అనర్హురాలిగా ప్రకటించాలని సిఇఒను కోరారు. దీనిపై సిఇఒ సుబ్బారావును వివరణ కోరగా వైసిపి జెడ్‌పిటిసి ఛైర్‌పర్సన్‌ను అనర్హురాలిగా ప్రకటించాలని వినతిపత్రం ఇచ్చిన మాట వాస్తవమేనని, అయితే నిబంధనల ప్రకారం వారు ఆ వినతి జిల్లా కలెక్టర్‌కు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. పదవి చేపట్టి నాలుగు సంవత్సరాలు గడిస్తే తప్ప అవిశ్వాస తీర్మానానికి కూడా అవకాశం ఉండదని ఆయన చెప్పారు.

భగత్‌సింగ్ నవతరానికి స్ఫూర్తి

పలుచోట్ల జయంతి వేడుకలు



ఆకివీడులో నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

పాలకొల్లు : పాలకొల్లులోని జివిఎస్‌వి ఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో శనివారం భగత్‌సింగ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం భవానీప్రసాద్ రాయపూడి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ అతి చిన్న వయసులో ఆనాడు అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్ వంటి యువ కిశోరాలు దేశంకోసం ప్రాణత్యాగం చేశారని చెప్పారు. ఆయన మద్దతుదారులు ఆయనను షహీద్(అమరవీరుడు)గా ప్రకటించారని అన్నారు. 12 ఏళ్ల వయసులోనే జలియన్ వాలాబాగ్ దారుణాలను చూసి భగత్‌సింగ్ రగిలిపోయాడని చెప్పారు. సామ్రాజ్యవాద బ్రిటీష్ పాలకులపై కసి పెంచుకున్నాడని, 14 ఏళ్ల ప్రాయంలోనే మహాత్ముడి పిలుపుతో సహాయ నిరాకరణ ఉద్యమంలోకి దూకాడని చెప్పారు. అక్టోబరు 30, 1928న కమిషన్ లాహోర్‌ను సందర్శించినప్పుడు సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా లాలా లజిపతి రాయ్ నేతృత్వంలో నిశ్శబ్ద అహింసా పద్ధతిలో ఒక నిరసన కార్యక్రమం జరిగిందని దానిలో పాల్గొన్నారని అన్నారు. భగత్ సింగ్ డైరీలోని పలు వ్యాఖ్యలు ఆయన విశిష్టమైన దార్శనిక అవగాహనకు అద్దం పడుతాయని చెప్పారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు చంద్రకళ, భవానీ దుర్గ, త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఆకివీడు : బ్రిటిష్ వారిని తరిమి కొట్టడానికి ఉరికంబాన్ని ముద్దాడిన భరతమాత ముద్దుబిడ్డ సర్దార్ భగత్ సింగ్ అని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్ అన్నారు. భగత్‌సింగ్ 117వ జయంతి కార్యక్రమం స్థానిక కార్తికేయ జూనియర్ కళాశాలలో శనివారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా ధనుష్ భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయనను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. డివైఎఫ్ఐ నాయకులు దొకల రవితేజ, బొడ్డపల్లి రాంబాబు, బివి.వర్మ, కాలేజీ ప్రిన్సిపల్ శేఖర్ పాల్గొన్నారు.

ఆచంట: సామాజిక అసమానతలు, సాంఘిక దురాచారాలు లేని సమసమాజ నిర్మాణం కోసం విద్యార్థులు, యువత పాటుపడాలని ఎంవిఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.శ్రీదేవి విద్యార్థులకు పిలుపునిచ్చారు. భారత స్వాతంత్ర్య పోరాట అమరవీరుడు షహీద్ భగత్ సింగ్ 117వ జయంతి, ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, అభ్యుదయ కవి పద్మభూషణ్ గుర్రం జాషువా 129వ జయంతి సందర్భంగా స్థానిక ఎంవిఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్ శర్మ అధ్యక్షత వహించి, నివాళులు అర్పించారు. సాహితీ స్రవంతి నాయకులు పి.మోహనరావు, నాగలక్ష్మి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

30న పంచాయతీ కార్మికుల ధర్నా

భీమవరం టౌన్ : పంచాయితీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు పెండింగ్ లేకుండా ప్రతినెలా క్రమంతప్పకుండా ఇవ్వాలని, కనీస వేతనం అమలు చేయాలని, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న కలెక్టోరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఆంజనే యులు తెలిపారు. శనివారం వెంప గ్రామంలో పంచాయతీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ధర్నా కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు, సిఐటియు మండల నేత ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడారు. గ్రామాల్లో స్వీపర్లు, గ్రీన్ అంబాసిడర్లు, ట్యాంక్ వాచర్లు, ఎలక్ట్రీషియన్స్, వివిధ రకాల పనులు చేసే సిబ్బంది ప్రతి పంచాయతీలోనూ ఉన్నారని, వారికి ప్రతినెలా వేతనాలు అందకపోవడం, కనీస వేతనాలు లేకపోవడం, సంవత్సరాలు తరబడి పని చేసినా పర్మినెంట్ అనేది లేకపోవడం కనీసం ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సదుపాయం కూడా వారికి అందకపోవడంతో అత్యంత దయనీయ స్థితిలో ఉన్నారన్నారు. ప్రమాదాలు జరుగుతున్నప్పుడు వారికి కనీస నష్టపరిహారం కూడా అందడం లేదని, ప్రతి సంవత్సరం ఇవ్వాల్సిన సబ్బులు, నూనె, యూనిఫారం, చెప్పులు వంటి సౌకర్యాలు కల్పించడం లేదని, ఇవన్నీ తెలిసినప్పటికీ జిల్లా అధికారులు కూడా ఏమీ తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. తిరునాళ్లు, జాతరలు, వరదలు, తుపాన్లు వచ్చినప్పుడు మంత్రులు, ఎంఎల్‌ఎలు ఉన్నతాధికారులు పర్యటించినప్పుడు పంచాయతీ కార్మికుల అవసరం కన్పిస్తుందని, మిగిలిన సమయాల్లో ప్రజాప్రతినిధులకుగాని, జిల్లా అధికారులకుగానీ గుర్తుకురారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30న జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నాకు పెద్దఎత్తున పంచాయతీ కార్మికులు కదిలిరావాలని విజ్ఞప్తి చేశారు.

ఆకాంక్షలేనా..!

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరి వంద రోజులైంది. కూటమి ఘనంగా ఇది మంచి ప్రభుత్వం పేరిట హడావుడి చేస్తోంది. పెన్షన్ సొమ్ము పెంపు హామీ అమలవ్వగా మిగిలిన సూపర్ సిక్స్ హామీల అమలు గురించి జనం ఎదురుచూస్తున్నారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ అమలు చేస్తామని ప్రకటించడం జనానికి కొంత ఊరటనిచ్చింది. ఇదే సమయంలో జనంతోపాటు కూటమి నేతలు సైతం నామినేటెడ్ పదవుల గురించి ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో టిడిపికి చెందిన ముగ్గురికి నామినేటెడ్ పదవులు దక్కగా జనసేన నుంచి ఎవరికీ దక్కకపోవడం చర్చనీయాంశమైంది. దీంతో రెండో జాబితా ఎప్పుడొస్తుందా అని అంతా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ప్రకటించిన మూడు పదవులు డెల్టా, ఏజెన్సీ, మెట్ట ప్రాంతాలకు కేటాయించినట్లుగా కన్పిస్తోంది. ఏజెన్సీ నుంచి ఎపి ట్రైకార్ ఛైర్మన్‌గా బొరగం శ్రీనివాసులు పదవి దక్కించుకోవడం పోలవరం నియోజకవర్గంలో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహానిచ్చిందనే చెప్పొచ్చు. ముందుగా ప్రకటించినట్లు ఉండి అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ నుంచి తప్పుకున్న టిడిపి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజుకు ఎపిఐఐసి పదవి కట్టబెట్టి సముచిత స్థానం కల్పించారు. అదే సమయంలో వీరవాసరానికి చెందిన మాజీ మంత్రి పీతల సుజాత గత ఎన్నికల్లోనూ చింతలపూడి టిక్కెట్ ఆశించారు. 2014 ఎన్నికల్లో చింతలపూడి నుంచి టిడిపి తరఫున గెలుపొంది మంత్రి పదవి చేపట్టిన సుజాత ఎంపీ మాగంటిబాబు తదితరులతో విబేధాల నేపథ్యంలో అర్థాంతరంగా మంత్రి పదవి కోల్పోయారు. అయినప్పటికీ ఆమె పార్టీని వీడకుండా 2019, 2024 ఎన్నికల్లోనూ చింతలపూడి టిక్కెట్ ఆశించినా దక్కలేదు. అయినా గత ఎన్నికల్లో ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఆమెకు రాష్ట్ర వినియోగదారుల రక్షణ మండలి ఛైర్‌పర్సన్ పదవి దక్కింది. ఇంకా టిడిపిలో నామినేటెడ్



పదవులు ఆశిస్తున్న జాబితా చాంతడంతా ఉంది. అందులో జిల్లాస్థాయి ముఖ్యనాయకులు ఉండటం విశేషం. అదే సమయంలో జనసేన నుంచి కూడా నామినేటెడ్ పదవుల ఆశావహులు పెద్దసంఖ్యలోనే ఉన్నారు. ప్రధానంగా టిడిపి గెలుపొందిన స్థానాల్లో పోటీ నుంచి తప్పుకున్న వారు, ఇతర నేతలు పదవుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే కార్యాచరణలో వీరిలో ఎంతమందికి పదవులు దక్కుతాయనేది అనుమానమే. ఈ క్రమంలోనే వైసిపి నుంచి కొంతమందిని జనసేనలోకి చేర్చుకోవడాన్ని ఆ పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. నామినేటెడ్ పదవులు దక్కకపోయినా స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలోకి దిగి పదవులు దక్కించాలనుకుంటే ఆ పదవుల్లో ఉన్నవారు తమ పార్టీలోకి చేరాక ఆ పదవులు వదులుకుంటారా అని ఆ పార్టీ దిగువస్థాయి నేతలు ప్రశ్నిస్తుండటం గమనార్హం. ఏదేమైనా నామినేటెడ్ పదవుల పందేరం కూటమిలోని తెలుగుదేశం, జనసేన పార్టీ శ్రేణుల్లో ఒకింత ఉత్సాహం, మరికొంత నిస్తేజం కల్గిస్తుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

ఇక నూజివీడులోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థ ట్రిపుల్ ఐటీలో పరిస్థితులు ఎప్పుడు చక్కదిద్దుకుంటాయోనని అక్కడి విద్యార్థులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ట్రిపుల్ ఐటీలో చేరిన విద్యార్థులు చదువుకన్నా తమ ఆరోగ్యం కోసం తపన పడాల్సి రావడం, అర్థాకలితో అలమటించాల్సి రావడం నిజంగా బాధాకరమే. ఇప్పటికీ అక్కడ మెస్‌ల్లో పరిస్థితులు మారకపోవడం వ్యవస్థీకృత లోపానికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. మెస్ కాంట్రాక్టర్‌ను తక్షణం మార్చాలని కొత్తగా ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అమరేంద్రరావుకు మంత్రి పార్థసారథి ఇచ్చిన ఆదేశాలు ఏమేరకు అమలవుతాయో, విద్యార్థుల ఇబ్బందులు ఎప్పటికి గట్టెక్కుతాయో వేచిచూడాలి.

-వివిఎస్‌వి.ప్రసాద్

తప్పు చేసిన వారిని వదిలేసి.. మమ్మల్ని అరెస్టు చేస్తారా!

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట వేమవరం మాల మహానాడు కార్యాలయంలో పోలీసులు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్‌ను శనివారం హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పుష్పరాజ్ మాట్లాడుతూ ఉండి నియోజకవర్గ ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు అంబేద్కర్ ఫ్లెక్సీని అందరూ చూస్తుండగా చించివేస్తే ఆయన్ని అరెస్టు చేయకుండా.. ప్రశ్నించిన దళిత నాయకులను హౌస్ అరెస్ట్ చేయటం దారుణమన్నారు. ఈ ప్రభుత్వం ద్వంద వైఖరి అవలంభిస్తుందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కల్పించుకుని ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజుపై చట్టపరమైన చర్యలకు పూనుకోకపోతే మాల మహానాడు ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయడానికి ఏమాత్రం వెనకడుగు వేసే ప్రసక్తే లేదని పుష్పరాజ్ హెచ్చరించారు.

నరసాపురం : ఏలూరుపాడులో అంబేద్కర్ ఫ్లెక్సీని చింపివేసిన ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజుపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘాలు చలో ఏలూరుపాడుకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం పోలీసులు దళిత నాయకులను హౌస్ అరెస్టులు చేశారు. మాల మహానాడు నరసాపురం డివిజన్ అధ్యక్షుడు కాకిలేటి ఆనంద్ కుమార్‌ను చిట్టవరంలోని ఆయన నివాసం వద్దే హౌస్ అరెస్ట్ చేశారు.

తణుకు : అంబేద్కర్ ఫ్లెక్సీని చించివేసిన ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజును అరెస్టు చేయకుండా ప్రశ్నించిన న్యాయవాది, దళిత నాయకుడు పొట్ల సురేష్‌ని హౌస్ అరెస్టు చేయడం దారుణమని దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు ప్రశ్నించారు. శనివారం ఆల్ ఇండియా పూలే అంబేద్కర్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు, న్యాయవాది పొట్ల సురేష్‌ని తణుకు టౌన్ పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు, కాకినాడ ఎంఎల్ఎ పంతం నానాజీలపై చర్యలు తీసుకుని ఉంటే ఈ ఉద్రిక్తతలు లేకుండా ఉంటాయన్నారు. ఆ పని చేయకుండా ప్రజాస్వామికవాదుల పై అక్రమ నిర్బంధాలకు పాల్పడుతున్న ప్రభుత్వం, పోలీస్ చర్యలను తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంభిస్తుందని, ఇప్పటికైనా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంఎల్ఎపై చర్యలు తీసుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా దళిత సంఘం నాయకులు ఇంటి దగ్గరకి వచ్చి అరెస్టుకి నిరసనగా సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు పాల్గొన్నారు.

పాలకొల్లు : ఎంఎల్ఎపై చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి మాల మహానాడు కార్యకర్తలు పిలుపునిచ్చారు. దీనిని భగ్నం చేసేందుకు పాలకొల్లు టౌన్ సిఐ రజనీ కుమార్ వారి బృందంతో పాలకొల్లులోని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నల్లి రాజేష్‌ను, వారి కార్యకర్తలను హౌసింగ్ బోర్డు కాలనీలోని ఆయన గృహం వద్ద అడ్డుకుని శనివారం హౌస్ అరెస్ట్ చేశారు.

న్యాయవాదులకు ఉచిత ఆరోగ్య కార్డులివ్వాలి

ఐలు రాష్ట్ర గౌరవాధ్యక్షులు దిగుపాటి రాజగోపాల్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

న్యాయవాదులకు ఉచిత ఆరోగ్య కార్డులు ఇవ్వాలని ఆల్ ఇండియా లాయర్ యూనియన్ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం శనివారం తాడేపల్లిగూడెం బార్ అసోసియేషన్ కార్యాలయంలో వి.శైలజ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఐలు రాష్ట్ర గౌర అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో వివిధ కోర్టుల్లో సుమారు 50 వేల మంది న్యాయవాద వృత్తి చేస్తున్నారని, వారి ఆరోగ్య పరిస్థితులను మెరుగుపరచుటకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. న్యాయవాద వృత్తిలో ఎక్కువ ఒత్తిడులకు గురవ్వడం వల్ల ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయని, వాటిని పరిష్కరించుకోకపోతే ఆర్థికంగా ఇబ్బందులు పడతారని అన్నారు. గతంలో బార్ కౌన్సిల్, రాష్ట్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ పాలసీలు కట్టేవారని, ఇప్పుడు దానిని నిలుపుదల చేశారని ఆయన అన్నారు. నేడు న్యాయవాది వృత్తి, న్యాయ వ్యవస్థను కాపాడుకోవలసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. నేడు న్యాయవ్యవస్థ స్వతంత్రతకు భంగం ఏర్పడుతుందని, దీనికి కారణం పాలకులు తీసుకునే నిర్ణయాలే అన్నారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం క్రిమినల్ చట్టాలలో మార్పు చేస్తూ తీసుకొచ్చిన చట్టాలు ప్రజలకు ప్రమాదకరంగా ఉన్నాయని, వాటిని సవరణ చేయాలని డిమాండ్ చేశారు. పాత చట్టాలకు కొత్త రూపుని చెబుతూ పాత సీసాలో నేరుగా కొత్త చట్టాల రూపాన్ని మార్చారు తప్ప అదే చట్టాన్ని అమలు అవుతుందన్నారు. కొన్ని చట్టాలు వల్ల దేశంలోని పౌర హక్కులకు భంగం కలుగుతుందన్నారు. కొత్త చట్టాలలో న్యాయ వ్యవస్థ అధికారాలను తగ్గించి, ఎగ్జిక్యూటివ్ అధికారాలను పెంచుతూ కొత్త చట్టాలు రూపొందించారని మునిస్వామి తెలిపారు. దీనిపై ప్రజలకు అవగాహన కోసం న్యాయవాదుల సదస్సులను నిర్వహించి, వారిని చైతన్యపరిచి చట్టాల మార్పుకు పోరాడుతామని తెలిపారు. ఈ సమావేశంలో న్యాయవాదులు ఎస్ఎన్.జౌద్దీన్ బాబా, కట్టా సత్యనారాయణ, పి.శ్రీనివాసు, కౌరు వెంకటేశ్వర్లు, గెద్దాడ విజయభాస్కరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజగోపాల్

జిఒ 117 రద్దుపై ఎపిటిఎఫ్ హర్షం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జిఒను రద్దు చేస్తానని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించడాన్ని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాశం హర్షం వ్యక్తం చేశారు. ఈ 117 జిఒ ప్రాథమిక విద్యా వ్యవస్థను చిన్నాభిన్నం(ఊరుఊరికి నాశనం) చేసిందన్నారు. దీన్ని రద్దు చేయాలని గత రెండు సంవత్సరాల నుంచి ఎపిటిఎఫ్ ఎన్నో ఉద్యమాలు చేసిందన్నారు. ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన మేరకు విద్యాశాఖ మంత్రి లోకేష్ వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఈ 117 జిఒను రద్దు చేస్తానని ప్రకటించడాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. అదేవిధంగా ప్రతి పైగా స్కూల్‌లో తెలుగు, ఇంగ్లీష్ మీడియంని పునరుద్ధరించాలని శనివారం ఒక ప్రకటనలో కోరారు.

నక్కల కాలువను ఆధునికీకరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్

ఆచంట : నియోజకవర్గంలో అత్యధికంగా పుడికలో ఉన్న మేజర్ డ్రెయిన్ నక్కల కాలువను ఆధునికీకరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. శనివారం ఆచంట వేమవరంలో సిపిఎం సీనియర్ నాయకులు కొండేటి సత్యనారాయణ అధ్యక్షతన శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సభలో గోపాలన్ పాల్గొని మాట్లాడుతూ ఆచంట వేమవరం గ్రామంలో రైతులు నక్కల డ్రెయిన్ ముంపు బారిన పడకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు. డ్రెయినేజీ, రహదారుల సమస్యలు పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శాఖ కార్యదర్శిగా గుత్తుల రంగారావును మరోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వెన్నపు ప్రసాద్, రాపాక సత్యనారాయణ, గెద్దాడ త్రిమూర్తులు, మైలే వెంకట్రావు, కరుటూరి రాధమ్మ పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయంలా తీర్చిదిద్దాలి

ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు

కాళ్ల : కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని మూడేళ్లలో వాడపల్లి వెంకటేశ్వరస్వామి దేవస్థానం మాదిరిగా తీర్చిదిద్దాలని, తన వంతు సాయం చేస్తానని ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణ రాజు పేర్కొన్నారు. కాళ్లకూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో నాలుగు రోజులపాటు జరిగిన సప్తనది జలాభిషేకం పూర్ణ పవిత్రోత్సవాల పూజలు శనివారంతో ముగిశాయి. శనివారం ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజుకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ఇఒ మోకా అరుణ్ కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. యాత్రికులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.


ఎంఎల్ఎను సత్కరిస్తున్న ఆలయ అర్చకులు

పిహెచ్‌సిని సిహెచ్‌సిగా మార్చాలి

సిపిఎం గణపవరం మహాసభ డిమాండ్

ప్రజాశక్తి - గణపవరం

మండల కేంద్రంలో ఉన్న పిహెచ్‌సిని సిహెచ్‌సిగా మార్పు చేసి ప్రజలకు 24 గంటలూ వైద్యం అందించాలని సిపిఎం గణపవరం 14వ మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన మహాసభకి చిన్నంచిన్ననాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. మహాసభ ప్రారంభ సూచికగా పార్టీ పతాకాన్ని మద్దాల నాగేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం మహాసభలో కార్యదర్శి నివేదికను ఎం.వెంకటరావు ప్రవేశ పెట్టగా నివేదికను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. సభలో పాల్గొన్న పార్టీ జిల్లానాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, మండల కార్యదర్శి పి.నరసింహమూర్తి మాట్లాడారు. అనంతరం గణపవరం నూతన కార్యదర్శిగా మేడిశెట్టి వెంకటరావును ఏకగ్రీవంగా మహాసభలో ఎన్నుకున్నారు. మహాసభలో ఉభయగోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న బొబ్బిలంకతెనను నూతనంగా నిర్మించాలని, ఎస్‌సి కాలనీలో డ్రెయినేజీ మెరుగు పరచాలని, గణపవరం ప్రజలకు ఫిల్టర్ నీటిని సరఫరా చేసి, మహిళలకు బాలికల హాస్టల్‌ను నూతనంగా నిర్మించి బాలికలకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, ఇందిరమ్మ కాలనీల్లో డ్రెయినేజీలు నిర్మించాలని మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

ప్రజల భక్తి, విశ్వాసాలతో ప్రభుత్వం ఆటలు

వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ ధ్వజం

ప్రజాశక్తి - ఆచంట

ప్రజల భక్తి, విశ్వాసాలతో ఆటలాడుతున్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు గడిచినా ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్క వాగ్దానం కూడా నిలబెట్టుకోలేదని, ప్రజల దృష్టి మరల్చడం కోసం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై నిందలు మోపుతుందని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ ధ్వజమెత్తారు. ఆచంట మండ గోపాలస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ కుమార్ మాట్లాడుతూ కూటమి నేతలు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి గత ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు, అసత్యాలు కల్పించి జగన్మోహన్ రెడ్డిని దెబ్బతీయాలని చూస్తున్నారన్నారు. చివరకు భగవంతుడిని కూడా రాజకీయాల్లోకి లాగి దిగజారిపోయిందని విమర్శించారు. మనవర్తి విజయ్ కుమార్, వస్కా ఉమేష్, గోరవర్తి కృష్ణకుమార్ పాల్గొన్నారు.

పెనుగొండ : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుపతి లడ్డూ ప్రతిష్టను దెబ్బతీశారని, పాప ప్రక్షాళన చేయడానికి వైసిపి శ్రేణులు ఆలయాల్లో పూజలు చేయాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన ఆదేశాల మేరకు పెనుగొండలో శ్రీనగరేశ్వరస్వామి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రతినిధులు పాల్గొనవలసిందిగా కోరారు.

తణుకు : రాజకీయ లబ్ది కోసం శ్రీవెంకటేశ్వరస్వామినే అస్త్రంగా వాడుకుంటున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు తగిన శిక్ష ఏడుకొండలవాడే వేస్తారని మాజీ మంత్రి డాక్టర్ కారుమూరి వెంకటనాగేశ్వరరావు అన్నారు. శనివారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపులో భాగంగా తణుకు శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంఎల్‌సి వంకరవరప్రసాద్, వైసిపి పట్టణ అధ్యక్షులు మంగిన సూర్య, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు పెన్మెత్స రామరాజు పాల్గొన్నారు.

ఉండి: చంద్రబాబు నాయుడుకు చిత్తశుద్ధి ఉంటే తిరుమల తిరుపతి లడ్డు ప్రసాదంపై తాను చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలకు, మోపిన నిందలకు సిబిఐ ఎంక్వైరీ, లేదా సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని ఉండి మండల వైసిపి నేతలు డిమాండ్ చేశారు. శనివారం ఉండి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వైసిపి మండల నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైసిపి మండల అధ్యక్షుడు ఆంజనేయరాజు, ఉండి ఎంపిపి నారాయణరాజు ఉన్నారు.

ఎంఎల్ఎ నాయకర్‌ను కలిసిన ఉపాధ్యాయులు

నరసాపురం: మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామంలో జెడ్‌పి హైస్కూల్, ఇంటర్ కళాశాల ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులు శనివారం నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాఠశాల, కళాశాలకు సంబంధించిన సమస్యలను తెలియజేసి వాటిని విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని విన్నవించారు. సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఎంఎల్ఎ హామీ ఇచ్చారు.

విద్యార్థులు నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి

ఘనంగా వాసవి జిఎంఆర్ జూనియర్ కాలేజీ ఫ్రెషర్స్ డే

తాడేపల్లిగూడెం : విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని, సమయాన్ని వృధా చేయకుండా నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని కళాశాల పూర్వ విద్యార్థి పవన్ కుమార్(యుఎస్ఎ) అన్నారు. శ్రీవాసవి జిఎంఆర్ జూనియర్ కాలేజీలో ఫ్రెషర్స్ డే వేడుకలను శనివారం కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పవన్ కుమార్(యుఎస్ఎ) మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, అబ్దుల్ కలాం వంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వారి విలువైన సూచనలు తెలిపినందుకు సీనియర్ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గ్రంధి సత్యనారాయణ, వైస్ చైర్మన్ కె.సూర్యనారాయణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వివిఎన్.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - తణుకు

పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బెల్‌వెధర్ ఇంటర్నేషనల్ స్కూల్ తణుకులో జరిగిన మోడరన్ పెంటథ్లాన్ పోటీలలో ఎస్.గణేష్, బి.భార్గవ్, జి.తేజారత్నంలు ప్రతిభ కనబరిచి శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైయ్యారని హెచ్‌ఎం ఆర్.మోహన్‌బాబు తెలిపారు. గణపవరం హైస్కూల్‌లో జరిగిన సాఫ్ట్ టెన్నిస్ జిల్లా సెలెక్షన్స్‌లో జి.వరప్రసాద్, పి.అశోక్‌లు ఎంపికై కడపలో జరిగే రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలకు ఎంపికైయ్యారన్నారు. ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తూ క్రీడా సామాగ్రి నిమిత్తం మండపాక గ్రామ టిడిపి నాయకులు ఆత్మకూరి రామకృష్ణ రూ.10వేలు బహూకరించారు. వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు సంకు సూర్యనారాయణను, ఎంపికైన క్రీడాకారులను గ్రామ సర్పంచి జానా వెంకటలక్ష్మీ, పాఠశాల ఎస్ఎంసి చైర్మెన్ జి.మహాలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి - మొగల్తూరు

ఉపాధ్యాయులు చదువు చెప్పడంతో పాటు క్రీడలలో కూడా ముందుండాలని పాఠశాల హెచ్‌ఎం జె.వెంకట నరసింహమూర్తి అన్నారు. యుటిఎఫ్ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ సంబరాలను మండలంలోని కెపిపాలెంలో ఉన్న జెడ్‌పి ఉన్నత పాఠశాలలో శనివారం సాయంత్రం ఉపాధ్యాయులకు మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఆయా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మండల స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన వారు ఆదివారం తణుకులో నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు. ఆయా పోటీలను యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతపల్లి కృష్ణమోహన్, సిహెచ్.శ్రీనివాసులు పర్యవేక్షించారు.

రఘురామకృష్ణరాజుపై చర్యలు తీసుకోవాలి

కెవిపిఎస్ ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - వీరవాసరం

ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజుపై చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. ఈమేరకు శనివారం మత్స్యపురిపాలెం అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా ఉన్న ఎంఎల్ఎ ఏకపక్షంగా వ్యవహరించడం సబబు కాదన్నారు. ప్రజా ప్రతినిధులుగా ఉన్న వారు ఏ మత విశ్వాసాలనైనా గౌరవించాలనేది రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛ కానీ ఎంఎల్ఎ వ్యాఖ్యలు మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని, అటువంటి చర్యలు మానుకోవాలన్నారు. కులం, మతం, ప్రాంతం పేరుతో రెచ్చగొట్టి అన్నదమ్ములుగా కలిసి ఉన్న ప్రజల మధ్యన చిచ్చు పెట్టి, శాంతిభద్రతలకు విఘాతం కల్పించేలా ప్రయత్నం చేస్తున్న ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజుపై చర్యలు తీసుకోవాలని అన్నారు. హిందువులను, క్రైస్తవులు, ముస్లింలు వ్యతిరేకులుగా రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్న వ్యాఖ్యలు మానుకోవాలని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు వెంటనే ఈ ఘటనపై స్పందించి ఎంఎల్ఎ వైఖరిని ఖండించాలన్నారు. లేదంటే ఈ ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు పోతుల మృత్యుంజయ, నాయకులు నల్లి మాణిక్యరావు, గునుపూడి నరసింహారావు, గుడిపూడి తేజ, బత్తుల చిరంజీవి, గుడిపూడి మాణిక్యాల రావు, దండపాటి చంటి, నల్లి బాబురావు, పైడి సంతోష్ పాల్గొన్నారు.

యువత ఉన్నత చదువులు చదవాలి : మంత్రి

పాలకొల్లు : యువత ఉన్నత చదువులు చదివి దేశానికి, రాష్ట్రానికి మంచి సేవలు అందించాలని మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. స్థానిక ఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన ఫ్రెషర్స్ డే లో మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు చదువును కొనే వాళ్లమని, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పుణ్యమా అని ఉచితంగా చదువు కుంటున్నామన్నారు. కార్పొరేటు కళాశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతనిస్తుందని, యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ముందుచూపుతో తన ఆస్తిని అమ్మి, కళాశాలలు స్థాపించి వేలాది మందికి యువతకు విద్యను అందించారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజరాజేశ్వరి, అధ్యాపకులు, నాయకులు జివి, పెచ్చెట్టి బాబు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ హయాంలో కుంటుపడిన అభివృద్ధి

పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమంలో ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం : గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే రాష్ట్ర అభివృద్ధి కుంటుపడటంలో ప్రధాన పాత్ర పోషించిందని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక వీకర్స్ కాలనీ నాన్న కళ్యాణ మండపంలో శనివారం మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన సామూహిక సీమంతం, పౌష్టికాహార పంపిణీ, మిషన్ వాత్సల్య పథకం కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల ఎన్‌డియే ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అభివృద్ధిని చూస్తే మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నామనే భావన అందరిలో కలుగుతుందన్నారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల కూటమి ప్రభుత్వం ఏర్పడే నాటికి ఖాళీ ఖజానాతో పాలన మొదలు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పంచాయతీ నిధులను దారి మళ్లించి గ్రామాలను అభివృద్ధికి ఆమడ దూరం నిలిపిన ఘనత వైఎస్.జగన్‌కే దక్కుతుందన్నారు. ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీలకు ఇవ్వడం ద్వారా కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల అభివృద్ధికి విశేష కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి, బిజెపి ఇన్‌ఛార్జి ఈతకోట తాతాజీ, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పళ్లు, బ్రెడ్ పంపిణీ

ఘనంగా జనసేన రాష్ట్ర ప్రొటోకాల్ చైర్మన్ తిరుమలరావు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

నిరంతర సేవాతత్పరుడు, నిస్సాహయులకు ఆప్తుడు మల్లినీడి తిరుమలరావు(బాబి) అని పలువురు వక్తలు అన్నారు. జనసేన రాష్ట్ర ప్రొటోకాల్ చైర్మన్ మల్లినీడి తిరుమలరావు(బాబి) పుట్టినరోజు వేడుకలను శనివారం భీమవరం పట్టణంలో వారి అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా పంచారామక్షేత్రమైన భీమవరం శ్రీఉమా సోమేశ్వర స్వామి, శ్రీమావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానం, వేంకటేశ్వర స్వామి దేవస్థానం, వెంకట సాయిబాబా దేవస్థానంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు, గర్భిణులకు బ్రెడ్స్, పండ్లు, పాలు పంపిణీ చేశారు. 12వ వార్డులోని ఇందిరమ్మ కాలనీలో 100 మంది పేదవారికి భోజనాలు అందించారు. గనుపూడిలోని వృద్ధ దంపతులు డొకల నగన్న, అప్పయమ్మలకు 26 కేజీల బియ్యం బస్తా, నిత్యావసర సరుకులను అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఉండపల్లి రమేష్ నాయుడు, రామకృష్ణ చౌదరి, చల్లా రాము, ఎంపిటిసి అరెటి వాసు, తాతపూడి రాంబాబు పాల్గొన్నారు.

అంగన్వాడీ సహాయకుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ఆచంట : శిశుఅభివృద్ధి పథకం, ఐసిడిఎస్ కార్యాలయం పెనుమంట్రలో ఈ దిగువ తెలియజేసిన అంగన్వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి స్థానిక మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐసిడిఎస్ సిడిపిఒ ఎ.కృష్ణకుమారి శనివారం విలేకరులకు తెలిపారు. ఆచంట చిన్నపేటలో ఎస్‌సి మహిళలకు, ఆచంట పంచాయతీ పరిధి కొనపోతుగుంటలో బిసి బి మహిళకు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆమె తెలిపారు. స్థానికులై ఉండి వివాహిత మహిళలు మాత్రమే అర్హులన్నారు. వయసు 21 నుంచి 35 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. కనీస విద్యార్హత పదో తరగతి పాసై ఉండాలన్నారు. దరఖాస్తులను అక్టోబర్ 5వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు శిశు అభివృద్ధి పథకం అధికారిని, సమగ్ర శిశుఅభివృద్ధి సేవా పథకం పెనుమంట్ర కార్యాలయంలో నమోదయించుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఒ ఎ.కృష్ణకుమారి తెలిపారు.

మొగల్తూరు : మొగల్తూరులోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్వాడీ కార్యకర్త, సహాయకురాలు ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నామని సిడిపిఒ ఊర్మిళ తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తకు కొత్తాడ పంచాయతీ పరిధి కాకాని చెరువులో బిసి ఎ, అంగన్వాడీ సహాయకురాలు భర్తీకి మొగల్తూరు పంచాయతీ పరిధి గరువుపల్లి పాలెంలో బిసి ఎ, పేరుపాలెం సౌత్ పంచాయతీ పరిధి బికె మెరక జనరల్, సరిపల్లెలోని సరిపల్లి గురువు ఎస్‌సి, సరిపల్లి ఎస్‌సి, నరసాపురం మున్సిపాలిటీ పరిధి క్రిస్టియన్ పేట జనరల్ ఖాళీలు భర్తీ చేయనున్నామని అన్నారు. దరఖాస్తుతో తగిన ధృవపత్రాల నకళ్లను జతచేసి వచ్చేనెల 5వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు మొగల్తూరులోని సిడిపిఒ కార్యాలయంలో స్వయంగా సమర్పించాలని సిడిపిఒ సూచించారు.

పాలకొల్లు రూరల్ : పాలకొల్లు నియోజకవర్గంలోని ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, మినీ అంగన్వాడీ కార్యకర్తలు, అంగన్వాడీ సహాయకురాలు పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చు అని సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం అధికారిణి సిహెచ్.ఇందిర తెలిపారు. పాలకొల్లు మండలంలో బల్లిపాడు, లంకలకోడేరు పెద్దపేట, దగ్గులూరు కంద పెరడు, కమ్ము, పెదమామిడిపల్లి, వెలివెల చర్చి స్ట్రీట్‌లలో ఖాళీలు ఉన్నాయి. పోడూరు మండలం మినీ మించిలిపాడు, యలమంచిలి మండలం మేడపాడు శాఖ వారి పేటలలో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు అర్హతా పత్రాలతో అక్టోబర్ 5వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు సమగ్ర శిశు అభివృద్ధి సేవ అధికారిణి, సమగ్ర శిశుఅభివృద్ధి సేవా పథకం పాలకొల్లు వారి కార్యాలయంలో స్వయంగా అందజేయాలని తెలిపారు. ఈనెల 29 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని తెలియజేశారు.

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం ప్రాజెక్టు పరిధిలోని తొమ్మిది అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఐసిడిఎస్ పిఒ టి.లక్ష్మీ సరస్వతి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాడేపల్లిగూడెం రెండో వార్డులోని అంగన్వాడీ పోస్ట్‌కు ఒసి మహిళ, ఆకు తీగపాడు ఎస్‌సి మహిళలకు రిజర్వేషన్లు కేటాయించారని తెలిపారు. అంగన్వాడీ సహాయకుల పోస్టులకు నవాబుపాలెం ఒసి మహిళ, మోయ్యేరు బిసి(ఇ) మహిళ, తాడేపల్లిగూడెం పట్టణంలోని 13వ వార్డుకు ఒసి మహిళ, కొమ్ముగూడెం ఎస్‌సి మహిళ, అదేవిధంగా కొమ్ముగూడెం-3 ఒసి మహిళ, తాడేపల్లిగూడెం పట్టణంలోని 10వ వార్డు ఒసి మహిళ, నీలా త్రిపుర 4 సెంటర్‌కు ఒసి మహిళ, రిజర్వేషన్లు కేటాయించినట్లు తెలిపారు.

సొంతింటి కలను సాకారం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో గృహాలు నిర్మించుకుని సొంత ఇంటి కలను నెరవేర్చుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మన ఇళ్ళు - మన గౌరవం కార్యక్రమంలో భాగంగా విస్సాకొడేరు లేఅవుట్‌లో గృహ నిర్మాణ లబ్ధిదారులకు అవగాహనా సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 2,558 ఇళ్లు రూఫ్, లెంటిల్ స్థాయిలో ఉన్నాయన్నారు. డిసెంబర్ చివరి నాటికి లబ్ధిదారులు పూర్తి చేయాలన్నారు. అలాగే వివిధ దశలలో ఉన్న 18,097 ఇళ్లను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తిచేయాలన్నారు. మార్చి తరువాత యూనిట్ ధర పెంచటం కానీ, బిల్లులు చెల్లించటం వంటివి కేంద్రం నుంచి నిలిచిపోతాయన్నారు. నిర్మాణంలో ఉన్న ప్రతి ఇంటికీ లబ్ధిదారుల అవసరం మేరకు స్వయం సహాయక సంఘాల ద్వారా అదనపు రుణం మంజూరు చేసి, ఇంటి నిర్మాణం త్వరగా పూర్తి చేసుకోవడానికి సహకారం అందిస్తామన్నారు. భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ లబ్ధిదారులకు గృహాలు ఏర్పాటు చేసి వారు సంతోషంగా ఉండేలా చూడాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ సహాయాన్ని వినియోగించుకొని త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలన్నారు. గృహ నిర్మాణ శాఖ ఇఇ బి.వెంకట రమణ, ఎఇ సాంబశివరావు, భీమవరం మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి పాల్గొన్నారు.

నరసాపురం : నియోజకవర్గంలో లబ్ధిదారులు తమ గృహాలను వేగంగా నిర్మించుకోవాలని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. శనివారం నరసాపురం మండలం సారవ గ్రామంలో నిర్వహించిన మన ఇల్లు- మన గౌరవం కార్యక్రమంలో ఎంఎల్ఎ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హౌసింగ్ అధికారులతో కలిసి గ్రామంలో ఉన్న లే అవుట్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులు తమ ఇళ్లను వచ్చే సంవత్సరం మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేసుకోవాలని అన్నారు. సారవ గ్రామ సర్పంచి కైల లావణ్య, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కె.విరభద్రరావు, గృహ నిర్మాణ శాఖ డిఇ పి.వెంకటేశ్వరరావు, రూరల్ ఎఇ రవీంద్ర, అర్బన్ ఎఇ నరేష్, కోటిపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రసాభాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నరసాపురం: నరసాపురం పురపాలక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం రసాభాసగా ప్రారంభమై, సమావేశం వాయిదా పడింది. శనివారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ బర్రె వెంకట రమణ అధ్యక్షతన నిర్వహించారు. తొలుతగా ఇటీవల మరణించిన మాజీ కౌన్సిలర్ పెమ్మాడి నరసింహారావు మృతిపట్ల సంతాపం తెలిపారు. అనంతరం అన్నాక్యాంటీన్ ప్రారంభం అంశంలో ప్రొటోకాల్ అంశాన్ని తుంగలోకి తొక్కి, ఎంఎల్ఎ మహిళా చైర్‌పర్సన్‌ని అవమానించడం సరికాదని వైసిపి కౌన్సిలర్లు మండిపడ్డారు. వైసిపి కాన్సిలర్ సిర్రా కాంతమ్మ మాట్లాడుతూ ఇటీవల అన్న క్యాంటీన్ ప్రారంభం సందర్భంగా చైర్‌పర్సన్, స్థానిక కౌన్సిలర్ ఫ్లెక్సీలు చింపడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, 30వ వార్డు కౌన్సిలర్ అడిదల శ్యామల జనసేన, టిడిపి కౌన్సిలర్లతో వాగ్వివాదానికి దిగారు. వారిపై ఏమి చర్యలు తీసుకున్నారని కమిషనర్‌ను ప్రశ్నించారు. కమిషనర్ నుంచి సమాధానం రాకపోవడంతో చైర్‌పర్సన్ పోడియం వద్ద వైసిపి కౌన్సిలర్లు బైఠాయించారు. వారంరోజుల్లో ఫ్లెక్సీలు చింపిన వారిపై కేసు పెడతామని కమిషనర్ హామీ ఇవ్వడంతో వైసిపి సభ్యులు ఆందోళన విరమించారు.

ఎస్ఐగా సురేంద్ర కుమార్ బాధ్యతలు

పాలకొల్లు రూరల్: పాలకొల్లు రూరల్ ఎస్ఐగా బి.సురేంద్ర కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో ఇరగవరం, పెనుమంట్ర, పోడూరు, టి.నరసాపురం స్టేషన్లలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం పనిచేసిన హరికృష్ణ కృష్ణా జిల్లాకి బదిలీ అయ్యారు.

1న ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక

వీరవాసరం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి అండర్-14, అండర్-17 బాలబాలికల హ్యాండ్ రోల్ బాల్ జిల్లా జట్ల ఎంపికలు ఈనెల 1వ తేదీన తణుకు మున్సిపల్ పార్క్‌లో జరగనున్నాయని పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పిఎస్ఎన్.మల్లేశ్వరరావు తెలిపారు. ఈమేరకు శనివారం ఆయన ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ ఎంపికలలో పాల్గొననున్న విద్యార్థులు ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు.

ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజుకు సత్కారం

కాళ్ల : రైతుల శ్రేయస్సు కోసం ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు కృషి చేయడం అభినందనీయమని రైతు కార్యాచరణ సమితి నాయకులు పేర్కొన్నారు. శనివారం పెదఅమిరం రైతు కార్యాచరణ సమితి నాయకులు ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజును కలిసి అభినందించారు. ఉండి నియోజకవర్గంలో పంట, మురుగు కాలువల అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని రైతు కార్యాచరణసమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రైతు కార్యాచరణ సమితి అధ్యక్షులు పాతపాటి మురళీరామరాజు, ఆర్‌విఎస్.రాజు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

ప॥గో॥జిల్లా, యలమంచిలి మండలం, కొంతేరు గ్రామంకు చెందిన దొంగ సంధ్యారాణి, భర్త: దొంగ పెద్దిరాజు, డోర్ నెం.3-137/1 పప్పుల మిల్లు వద్ద, కొంతేరు. తెలియజేయునది ఏమనగా 2016 సంవత్సరంలో మేము కొంతేరులో ఇళ్ళు మారుతున్న సమయంలో మాకు పెనుగొండ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ది.30-03-1998 లో క్రయం ద్వారా నా పేరున పొందిన సేల్ డీడ్ నెంబర్ 574/1998 ఒరిజినల్ డాక్యుమెంట్లు పోయినవి. అప్పటినుంచి ఎన్ని ప్రయత్నాలు చేసినా మా ఒరిజినల్ డాక్యుమెంట్లు దొరకలేదు. నా ఒరిజినల్ డాక్యుమెంట్లు ఏవరికైనా దొరికిన నాకు అందజేయగలరు.

సెల్: 95059 37177

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ వారి కోర్టులో

E.P. No. 84/2013 in OS. No. 151/2007

బిట్వీన్:
1.కోనాల వీర వెంకట సత్యనారాయణ రెడ్డి (died)
2.కోనాల వెంకట రెడ్డి ....డిక్రీ హోల్డర్స్
(as per orders in EA72/24, dt. 07-05-2024)
2nd DHR is added

Vs

రేపాక ఆనందరావు
టు ....జడ్జిమెంట్ డేట్టార్
రేపాక ఆనందరావు
S/o ఇజ్రాయేలు, వయసు 55 సం.రాలు
దిగమర్రు, పాలకొల్లు మండలం

పై నెంబరు EP గ్రంథములో జడ్జిమెంట్ డేట్టార్ యొక్క ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ది. 14-10-2024వ తేదీన ఉ.గం. 10-30 ని.ల లగాయతు పైన తెలిపిన కోర్టు నందు వేలం ద్వారా విక్రయించబడును. కావున కావలసిన వారు వేలంలో పాల్గొని క్రియం పొందగలరు.

షెడ్యూలు

Item.No.1: పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు సబ్-రిజిస్ట్రారులో చేరిన పాలకొల్లు మండలం, దిగమర్రు గ్రామంలో యం.1.00 సెంట్లు RS no.312లో దక్షిణం వైపున గల యం.0.50 సెంట్లు భూమికి హద్దులు.

తూర్పు : రేపాక కాసులు గారి భూమి
పడమర : కొల్లాబత్తుల మేరి సుశీల గారి భూమి
దక్షిణము : మురుగు కాలువ
ఉత్తరం : మందపాటి పెద్దిరాజు గారి భూమి

అమీనా విలువ Rs. 2,00,000/-
DHR విలువ Rs. 1,90,000/-
(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

యం. వెంకట రామిరెడ్డి
పాలకొల్లు అడ్వకేటు
ది.28-09-2024

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ వారి కోర్టులో

E.P. No. 45/2019 in OS. No. 193/2009

బిట్వీన్:
గబ్బిడి స్వామి ....డిక్రీ హోల్డర్స్

Vs

అందే వీర వెంకట రామచంద్రరావు
టు ....జడ్జిమెంట్ డేట్టార్
అందే వీర వెంకట రామచంద్రరావు
S/o రాఘవరావు, వయసు 45 సం.రాలు
కే.పి.పాలెం, మొగల్తూరు, మొగల్తూరు మండలం

పై నెంబరు EP గ్రంథములో జడ్జిమెంట్ డేట్టార్ యొక్క ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ది. 21-10-2024వ తేదీన ఉ.గం. 10-30 ని.ల లగాయతు పైన తెలిపిన కోర్టు నందు వేలం ద్వారా విక్రయించబడును. కావున కావలసిన వారు వేలంలో పాల్గొని క్రియం పొందగలరు.

షెడ్యూలు

Item.No.1: పశ్చిమ గోదావరి జిల్లా, మొగల్తూరు సబ్-రిజిస్ట్రారులో చేరిన నరసాపురం మండలం, లింగబోయినచర్ల గ్రామంలో గల రి.స.నెం.434/3 లో గల య 2.54 సెంట్లు జిరాయతీ మెరక భూమి మరియు రి.స.నెం.434/10 లో గల య 0.60 సెంట్లు జిరాయతీ మెరక భూమి ఏకప్రతిగా ఉన్నందున రెండు ప్రతులు య 3-14 సెంట్లు భూమికి హద్దులు.

తూర్పు : మెరక గయాలు
పడమర : ఉప్పల సత్యనారాయణ గారి భూమి
దక్షిణము : రైతు సేద్యం
ఉత్తరం : గవర్నమెంటు పుంత

అమీనా విలువ Rs. 7,85,000/-
DHR విలువ Rs. 8,40,000/-
(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

యం. వెంకట రామిరెడ్డి
పాలకొల్లు అడ్వకేటు
ది.28-09-2024